క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

రేపల్లె: ఏపీఎస్ఆర్టీసీ రేపల్లె డిపోలో ఈ నెల 15వ తేదీ మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేపల్లె డిపో బస్సు సర్వీసులకు సంబంధించి సలహాలు, సూచనలు, డిపో అభివృద్ధి, ప్రయాణికుల సమస్యలపై 9959225423 నంబరు ద్వారా తెలపాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని 10వ వార్డులో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఈఈ శ్యామ్‌సుధాకర్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరవపల్లి రోడ్డు, ఏకలవ్య సెంటర్ ప్రాంతాలలో సైతం విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుడు మురళీమోహన్‌కు సత్కారం



భట్టిప్రోలు: మనం ఫౌండేషన్ దక్షిణ భారతదేశంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించే వారికి ఇచ్చే భారత పద్మ ప్రతిభ అవార్డును హైదరాబాద్‌లో భట్టిప్రోలు మండలం వెల్లటూరు జెడ్పీ హైస్కూల్ సోషల్ ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్ అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం హెచ్‌ఎం కర్రా అరుణకుమారి, ఉపాధ్యాయయులు ఆయనను అభినందించి సత్కరించారు. గుర్రం మురళీమోహన్ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందుకోవడం హర్షణీయమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నక్కా వెంకటేశ్వర్లు, కె.శివరామకృష్ణ, కె.కుటుంబరావు, ఎస్టేట్‌బాబు, శ్రీనివాసరావు, శైలజ, ఆషాలత, వెంకటస్వామి, విజయలక్ష్మి, బేబి, రాణి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



భట్టిప్రోలు : పేద తరగతి కుటుంబాలలోని చిన్నారులు విద్యాభ్యాసంలో ఎదుర్కొనే సమస్యలను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన నోట్ పుస్తకాలను భట్టిప్రోలుకు చెందిన దాత సోమవారం అందజేశారు. భట్టిప్రోలు అయ్యప్ప సాయిరాం స్వీట్ హోమ్ అధినేత గాత్రం నారాయణం మండలంలోని వెల్లటూరు ఎంపీపీఎస్ (జీసీ), ఎంపీపీఎస్ (హెచ్‌డబ్ల్యూ) పాఠశాలల్లోని 1వ నుంచి 5వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న 52 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఎంఈవో ఎన్.దేవరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి బి.రవి, ఉపాధ్యాయులు వి.సురేష్ కుమార్, జేపీ పున్నయ్య, ఎం.కృష్ణప్రియ, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బెంచీలు, టీవీ వితరణ



భట్టిప్రోలు : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల సౌకర్యాలు మెరుగుపరిచేందుకు దాతలు ముందుకొచ్చారు. మండలంలోని పల్లెపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.67 వేలు విలువ చేసే బెంచీలు, స్మార్ట్ టీవీని అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. పెసర్లంక అంబేడ్కర్ యూత్, గ్రామ పెద్దల సహకారంతో విద్యార్థులు కూర్చోవడానికి రూ.50 వేలు విలువ చేసే 8 బెంచీలు, రూ.17 వేలు విలువైన స్మార్ట్ టీవీని అందజేశారు. దాతలు అందజేసిన బెంచీలు, టీవీని మండల ఎంఈవో నీలా దేవరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ, దాతలు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకారం అందించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి పాఠశాల బలోపేతానికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

బీ ఫార్మసీ ఫలితాల్లో ఏఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ

తెనాలిఅర్బన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విడుదల చేసిన బీ ఫార్మసీ ఫలితాల్లో తెనాలిలోని అన్నాబత్తుని సత్యనారాయణ ఫార్మసీ కళాశాల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్లపల్లి వెంకట రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ అన్నాబత్తుని శివకుమార్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



పంట కాలువ ఇలా.. సాగునీరు పారేదెలా..?!

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల చేత పంట కాలువల తవ్వకాలు చేపడుతున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలోని పంట కాలువలు ఉపాధి హామీ పథకం కూలీలు చేత పూడిక తీయిస్తున్నారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామంలో ఆర్ అండ్ బీ రోడ్డు పక్కన ఉన్న కాలువ పూడిక ఎందుకు తీయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాలువ చాలా అధ్వానంగా ఉందని, కాలువల్లో ముళ్ల పొదలు, చెట్లు వ్యాపించి ఉన్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో నీరు పారుదల కావడం చాలా కష్టంగా ఉందని సాగు నీరు అందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు కాలువపై దృష్టి సారించి కాలువ పూడిక తీయాలని రైతులు కోరుతున్నారు.

–వేమూరు



నిరుపయోగంగా మారిన తాగు నీటి పంపు

చెట్టు కింద దళితవాడకు తాగు నీటి పైపు లైనుకు ఏర్పాటు చేసిన మంచి నీటి పంపు నిరుపయోగంగా మారింది. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలోని చెట్టు కింద దళితవాడకు తాగునీటి పైపులైను వేశారు. పంపు ద్వారా నీటిని చెట్టు కింద దళితవాడలోని వాటర్ ట్యాంక్‌కు పంపించాలి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తాగు నీటి పైపులైను గురించి పట్టించుకోకపోవడంతో చెట్టు కింద దళితవాడలో ఏర్పాటు చేసిన తాగు నీటి పంపు నిరుపయోగంగా మారింది. దీంతో దళితవాడకు తాగు నీరు అందని పరిస్థితి నెలకొంది. తాగు నీరు అందక దళితవాడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

–చుండూరు(వేమూరు)

ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఉపకరణాలు అందజేత

కొల్లూరు : ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు విద్యను అందించే విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కొల్లూరు ఎంఈవో–2 వి.సౌభాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం కొల్లూరు గౌడపాలెంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అవసరమైన ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల మానసిక స్థితికి తగినట్లుగా, వారికి అవసరమైన రీతిలో విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగ బాలబాలికల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో భాగంగా ప్రభుత్వం పలు భత్యాలను అందజేస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారులకు ట్రై సైకిళ్లు, వీల్ చైర్‌లు, వాకర్‌లు, బ్రెయిలీకిట్ వంటి ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విప్పర్ల ఉమాదేవి, ప్రత్యేక ఉపాధ్యాయులు తూమాటి ధనరాజు, ఎం.అంతోనమ్మ పాల్గొన్నారు.



ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తున్న ఎంఈవో-2, ఉపాధ్యాయులు

మొలాసిస్ ట్యాంక్ పరిశీలించిన ఎక్సైజ్ అధికారులు

వేమూరు: జంపని షుగర్ ఫ్యాక్టరీలోని ట్యాంక్‌లో మొలాసిస్ కొన్ని సంవత్సరాల నుంచి నిల్వ ఉందని తమ దృష్టికి యాజమాన్యం తీసుకొని రావడం జరిగిందని బాపట్ల జిల్లా ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. వేమూరు మండలంలోని జంపని వీఎస్ఆర్, ఏడీఆర్ కోపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ చాలా సంవత్సరాల క్రితం మూత పడింది. అప్పటి నుంచి మొలాసిస్ ట్యాంక్‌లో నిల్వ ఉంది. కొన్ని సంవత్సరాలు నుంచి ట్యాంక్‌లో మొలాసిస్ నిల్వ ఉందని డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫ్యాక్టరీ యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు సోమవారం మొలాసిస్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొలాసిస్ టెండరు తీసుకున్న వ్యక్తులు ఇంత వరకు తీసుకెళ్లలుదని, సోమవారం ఫ్యాక్టరీకి వెళ్లి ట్యాంక్ పరిశీలించి సంబంధిత వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడటం జరిగిందన్నారు. అనంతరం ఫ్యాక్టరీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొలాసిస్ టెండర్ తీసుకున్న వ్యక్తితో మాట్లాడి సమస్య పరిష్కారం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఫ్యాక్టరీ సిబ్బంది బసివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జంపని ఫ్యాక్టరీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వర్లు

నాణ్యమైన కల్లు విక్రయాలు జరపాలి



రేపల్లె: కల్లు విక్రేతలు విక్రయదారులకు నాణ్యమైన కల్లు విక్రయాలు మాత్రమే చేయాలని, కల్లులో ఎటువంటి కల్తీ జరిగినా సహించేది లేదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌ఐ రాజశ్రీ చెప్పారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో కల్తీ కల్లు తాగి పలువురు మృతి చెందిన నేపథ్యంలో పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం భట్టిప్రోలు, రేపల్లెకు చెందిన కల్లు విక్రేతలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కల్లు విక్రేతలు విక్రయించే కల్లు నుంచి నిత్యం శాంపిల్స్ తీసి రసాయన పరీక్షలకై పంపటం జరుగుతుందన్నారు. నిషేధిత డైజోఫామ్, క్లోరోఫామ్, ఆల్ప్రోజోమ్ వంటి రసాయనాలు కల్లులో కలిపి కల్తీ చేయటంతో ప్రాణహాని నూరు శాతం ఉంటుందని, అటువంటి విషపూరితమైన పదార్థాలను వినియోగించరాదని హెచ్చరించారు. ఎవరైనా కల్తీ కల్లు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. నిరంతరం కల్లు దుకాణాలపై నిఘా ఉంటుందన్నారు. సమావేశంలో కల్లు గీత కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ఇంటింటికీ ప్రచారం చేయాలి

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



మాట్లాడుతున్న డాక్టర్ గణేష్

నగరం: మోసం చెయ్యడం, వెన్నుపోటు పొడవటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. మండల కేంద్రమైన నగరంలో సోమవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ, రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టోపై జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో డాక్టర్ గణేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారం కోసం అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది కూటమి ప్రభుత్వమేనన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి అధికారంలో వచ్చి సంవత్సరం పూర్తయినా వాటిని పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. దొంగ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన విధానంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు పార్టీ కార్యకర్తలు కూటమి ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఇంకోల్లు రామకృష్ణ, నాయకులు ఎస్.కోటేశ్వరరావు, పాగోలు వెంకటేశ్వరావు, డి.కొండల రెడ్డి, టీ బాలకృష్ణ, శాంతిరాజ్, పృథ్వీ, బాబురావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు

వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు శౌంతి సురేష్



రేపల్లె: కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదని సాక్షాత్తూ కృష్ణాజిల్లా ప్రథమ పౌరురాలు జెడ్పీ చైర్మన్ హారికపై కూటమి కార్యకర్తలు దాడికి పాల్పడటం అమానుషమని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు శౌంతి సురేష్ అన్నారు. రేపల్లెలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పథకం ప్రకారమే టీడీపీ, జనసేన రౌడీమూకలు హారిక వాహనంపై ఎగబడి వాహనాన్ని ధ్వంసం చేయటంతో పాటు దాడికి పాల్పడ్డాయన్నారు. బీసీ గౌడ సామాజిక వర్గానికి చెందిన హారిక వివాదాలకు దూరంగా ఉంటారన్నారు. ఆమెపై దాడికి పాల్పడటం బాధాకరమన్నారు. బీసీలకు నిత్యం అండగా ఉంటానంటూ చెప్పుకునే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నోరు మెదపకపోవటం ఏమిటని ప్రశ్నించారు. ఓట్ల కోసం శవ రాజకీయాలు చేసే సత్యప్రసాద్ ఈ విషయంపై మాట్లాడాలన్నారు. హారికపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కార వేదికకు 6 అర్జీలు

రేపల్లె: ప్రజలు సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. విద్యుత్ శాఖ లోడ్ ఎక్కువగా చూపి అధిక విద్యుత్ బిల్లు ఇచ్చారని మోళ్ళగుంట గ్రామానికి చెందిన ధనుంజయరావు, మోళ్ళగుంట పంచాయతీ పరిధిలో తమ పంట భూముల పక్కనే రొయ్యల చెరువులు అక్రమంగా తీస్తున్నారని, దీంతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని గాదేవారిపాలెంకు చెందిన తాడికొండ వెంకట ఝాన్సీ లక్ష్మీబాయి, భట్టిప్రోలు మండలం పెద్ద పులివర్రు గ్రామంలో తమ 54 సెంట్ల భూమిని సర్వే చేసి హద్దులు చూపాలని రేపల్లె మండలం కారుమూరుకు చెందిన శివలక్ష్మి అర్జీలు ఇచ్చారన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

- సింగుపాలెం పంచాయతీలో 2023–24 సంవత్సరానికి చేపల చెరువు పాడుకొని సాగు చేయగా నష్టం రావటంతో ఆ సంవత్సరం లీజు సొమ్ము కట్టలేకపోయానని ఈ సంవత్సరం సాగు చేసుకుంటున్నప్పటికీ పంచాయతీ వారు చెరువుకు వేలం నిర్వహిస్తున్నారని తనకు న్యాయం చేయాలని గ్రామానికి చెందిన నిజాంపట్నం వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారన్నారు.
- తన ఇంటి రహదారి ఆక్రమణకు గురైందని ఆ రహదారికి కొలతలు వేసి హద్దులు చూపాలని రేపల్లెకు చెందిన కొడాలి సుందరరావు, తనకు చెందిన భూములను తన అన్న అక్రమంగా సాగు చేసుకుంటున్నాడని రేపల్లెకు చెందిన కంచర్ల హెడ్ల లలితకుమారి ఫిర్యాదు చేశారన్నారు. తమకు అందిన ఆరు సమస్యలు ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించబడునని చెప్పారు.

కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

లక్ష్మీపురం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ కోరారు. ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె సోమవారానికి రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి నారాయణ ప్రకటించారని, ముఖ్యమంత్రి ఆదేశించిన తర్వాత ఇంకా ఆలస్యం చేయటం ఏమిటని ఎద్దేవా చేశారు. మున్సిపల్ కార్మికులు ప్రాణాలకు తెగించి పని చేస్తూ పట్టణ ప్రజలకు మంచినీరు, పారిశుద్ధ్యం అందిస్తున్నారని, అలాంటి వారికి జీతాలు పెంచకుండా ప్రభుత్వం తాత్సారం చేయడం ఏమిటని అన్నారు. గత సమ్మె సందర్భంగా చేసుకున్న ఒప్పందాలకు జీఓలు ఇవ్వాలని సంవత్సరం నుంచి కోరుతున్నా జీఓలు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్, అధికారులు కార్మికులను షోకాజ్ నోటీసులు అంటూ, పనిలో తొలగిస్తామని భయపెట్టడం హేయమైన చర్య అని అన్నారు. రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు ఒ.నారాయణరెడ్డి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని అన్నారు. బీసీ బహుజన ఫ్రంట్ కన్వీనర్ తాడికొండ నరసింహారావు మాట్లాడుతూ కార్మికుల శ్రమను దోచుకుంటూ వారికి ఇవ్వవలసిన కనీస వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం వ్యవహరించడం అన్యాయమని అన్నారు. రెండో రోజు సమ్మెలో గుంటూరు నగరపాలక సంస్థలోని వాటర్ వర్క్స్ కార్మికులు, లీకు వర్కర్స్, టౌన్ ప్లానింగ్ దళం, సెక్యూరిటీ గార్డులు, పార్క్ గార్డెనర్స్ పాల్గొన్నారు. ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు ఆది నికల్సన్, షేక్ ఖాసీం వలి, కార్మికులు పాశం పూర్ణచంద్రరావు, కాటంరాజు, సిద్దాబత్తిన శ్రీనివాసరావు, జి సురేష్ బాబు, బాలకష్ణ యాసిడ్ ఖాన్, కాశయ్య, సలాం, భాష, మహేష్, సుబ్రహ్మణ్యం, ఆర్ముగం, నాగరాజు, దుర్గారావు, ఏసు పాల్గొన్నారు.



సమ్మెకు మద్దతు తెలుపుతునన్న సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

నారాకోడూరులో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మూడు షాపుల్లో రూ.2.77 లక్షల విత్తనాల అమ్మకాలు నిలుపుదల

చేబ్రోలు: నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ స్టేట్ లెవల్ తనిఖీ బృందం అధికారులు ఎం.సునీల్ అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరులోని రెండు ఎరువుల షాపులు, చేబ్రోలులోని ఒక షాపును అధికారులు సోమవారం తనిఖీ చేశారు. రూ.2,77,898ల వివిధ కంపెనీలక చెందిన విత్తనాలను అధికారులు అమ్మకాలను నిలుపదల చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. విజిలెన్స్ సీఐ సీహెచ్ రవిబాబు, గన్నవరం ఏడీఏ ఎం.సునీల్‌ల ఆధ్వర్యంలో స్టేట్ లెవల్ తనిఖీ బృందం నారాకోడూరులోని పలు దుకాణాల్లో తనిఖీ చేశారు. పొన్నూరు ఏడీఏ పి.రామకోటేశ్వరి, చేబ్రోలు ఏవో పి.ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు: వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పురుగు మందులు, ఎరువులు, విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో పొన్నూరులోని పలు ట్రేడర్స్‌లో గల విత్తనాల నిల్వలను పరిశీలించారు. అనుమతి లేని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రూ.22,55,810 విలువైన 1726 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను నిలిపివేశారు. తనిఖీల్లో ప్రత్యేక తనిఖీ బృందాలు ఎం.సునీల్, సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ రవిబాబు, రామకోటేశ్వరి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.కిషోర్, ఏవో ఆరు వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు



పొన్నూరు: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కూల్ డ్రింక్స్ లోడుతో వెళుతున్న ఆటో బోల్తా పడిన సంఘటన సోమవారం మండలంలోని కట్టెంపూడి ప్రధాన రహదారిలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంతో ఆటోలోని కూల్ డ్రింక్స్ సీసాలు కింద పడడంతో కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

చిరుధాన్యాల ఆహారం గ్లోబల్ వార్మింగ్‌కి పరిష్కారం

గుంటూరు రూరల్: మారుతున్న మన ఆహారపు అలవాట్లు, జీవన సరళి వల్ల గ్లోబల్ వార్మింగ్ రోజు రోజుకీ పెరుగుతుందని.. దానికి పరిష్కారం చిరుధాన్యాల పంటలు, ఆహారం ద్వారానే సాధ్యమని చిరుధాన్యాల నిపుణులు డాక్టర్ సరళ ఖాదర్ తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట రైతునేస్తం ఫౌండేషన్‌లో రైతులకు ఏర్పాటు చేసిన చిరుధాన్యాల పంటలు, ఆహారం విలువల జోడింపుపై శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కువ మంది ప్రజల ప్రధాన ఆహారాలైన వరి, గోధుమ, చెరుకు పంటల సాగుకు విపరీతంగా నీటి అవసరం ఉంటుందని, చిరుధాన్యాలను ఆహారంగా తీసుకున్నట్లయితే తక్కువ నీటితో ఆరోగ్యకరమైన పంటలను పండించుకోవచ్చని తెలిపారు. రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వేంకటేశ్వరరావు మాట్లాడుతూ.. చిరుధాన్యాలను సరైన మెళకువలతో ఆహారంగా తీసుకున్నట్లయితే ఎలాంటి ప్రతికూల ప్రభావాలు ఉండకపోగా ఆరోగ్యాలను పదిలంగా ఉంచుతాయన్నారు. అనంతరం రైతులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో రైతులు, విద్యార్థులు, ఫౌండేషన్ సిబ్బంది తదితరులున్నారు.



ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్ట్

పెదకాకాని: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన ఇంటూరు కిరణ్, షేక్ సమీర్‌భాషా, గుంటూరుకు చెందిన సయ్యద్ చిన్న భాషాలు.. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం ప్రాంతంలోని చింతపల్లికి చెందిన గుర్తు తెలియని వ్యక్తుల వద్ద 1500 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. అందులో 1400 గ్రాముల గంజాయిని పెదకాకాని వై జంక్షన్ శివారులో చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేస్తుండగా పోలీసులు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు పెదకాకాని సీఐ టి.పి.నారాయణస్వామి తెలిపారు.

క్రమశిక్షణతో జీవించండి



తెనాలిఅర్బన్: క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అందరూ అలవర్చుకోవాలని ఆంధ్ర బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ మహేష్ పేర్కొన్నారు. వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు సోమ వారం బి,సి సర్టిఫికెట్లు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, దేశ శ్రేయస్సు కోసం అందరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ గురుదీప్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ జిఎఫ్.కిరణ్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి కె.ఆశోక్, తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: కాల్వల్లో మురుగు పరటం లేదు.. ప్రతి రోజు వీటిని బాగు చేస్తున్న ఎందురు ఈ పరిస్థితి ఏర్పడదంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చు కోవాలని హెచ్చరించారు. పట్టణంలోని 31వ వార్డులో సోమవారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వల్లో వ్యర్థాలు గుట్టలు ఉండటాన్ని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని మురుగు కాల్వల పారుదల జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి, ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.